

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 245 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం, 04, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# మహిళా 'పవర్' మతిపోయే రాజకీయాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాను శాసిస్తున్న మహిళ
- ఎమ్మెల్యేను బొల్తా కొట్టిస్తూ పైరవీలు చేస్తుంది
- ఎమ్మెల్యే కనుసందుల్లో అన్ని జరిగిపోతున్నాయి
- పోలీసులంతా ఆ మహిళ చుట్టే చెక్కర్లు కొడుతున్నారు
- పోస్టింగులు మొదలుకొని పైస వ్యాపారాలు చక్కగా సాగుతున్నాయి
- మహానగరానికి పాకిన ఆ మహిళ పైరవీల జోరు
- మహా పవర్ఫుల్ మహిళగా పెత్తనం చెలాయిస్తున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ
- నాయకుల సంబరాలు ఏమో గాని ప్రజాసేవ నామరూపం లేకుండా పోతుంది
- దర్జాగా పైరవీలు చేస్తూ పెత్తనం చేస్తున్నారు
- ఆ మహిళా పవర్ చూసి రాజకీయ నాయకులే తల పట్టుకుంటున్నారు : డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఒక పవర్ఫుల్ మహిళా పెత్తనంపై విపరీతమైన చర్చ నడుస్తుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేని అధికార వర్గంతో పాటు ఎమ్మెల్యేలను శాసిస్తూ తన ప్రతాపాన్ని కొనసాగిస్తుండడం పట్ల తీవ్రమైన చర్చ నడుస్తుందన్నారు.పోలీస్ పోస్టింగులు మొదలుకొని రాజకీయ పైరవీలు, భూ కబ్జాల పైరవీలు,యదేచ్ఛగా సాగుతున్నాయని ఏకంగా అధికార పార్టీకి చెందిన మహిళలే పలు చోట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.చాలా కాలంగా రాజకీయంలో ఉంటున్నటువంటి అధికార పదవికి చెందిన మహిళలు సంపాదించాలేని పేరు ప్రఖ్యాతలు అనాది కాలంలోనే సంపాదించుకున్న మహిళ ఎమ్మెల్యే ఎండతో ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలను శాసించే స్థాయికి చేరువైన విధానం ఎక్కడ చూసిన ఒకే రకమైన చర్చ కొనసాగుతుందన్నారు.పోలీస్ పోస్టింగ్లలో ఒకరిని మించి మరొకరు ఆ మహిళా చుట్టూ చక్కర్లు కొడుతూ పోలీస్ పోస్టింగ్ లు సంపాదించుకోవడం కోసం తెగ ఆరాటపడుతున్నారని పలు రకాల అనుమానాలు వ్యక్తం చేశారు.రాజకీయ సమావేశాల్లో ఎక్కడా కనిపించని ఆ మహిళ రహస్య పైరవీరులలో మాత్రం రాజధానిని చుట్టుముట్టే పైరవీలు సైతం రెప్పపాటులో చేసే స్థాయికి ఎదుగగలిగారంటే కేవలం ఆ ఎమ్మెల్యే పుణ్యమే నంటూ పోలీస్ వర్గాల్లో తీవ్రమైన చర్చ నడుస్తుందన్నారు.ఈ మధ్యకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో భయంకరమైన భూకబ్జాలు పెరిగిపోతున్నాయని వాటన్నిటి పైరవీలను ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్తూ ఏం చక్క పైసా వ్యాపారాలకు పాల్పడుతున్నట్లు తీవ్రమైన చర్చ వెలుగులోకి వస్తుందన్నారు.బర్జే పార్టీలలో ఇతర పార్టీలలో రహస్యంగా సన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్న పోలీసు అధికారులు పోస్టింగులలో మాత్రం తేడా రాకుండా జాగ్రత్తలు పడుతున్నారని

- మిగతా 2లో..

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

**వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే**

**రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్ట్3(జై భీమ్ న్యూస్):**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు.ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.



## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

**జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్ట్3(జై భీమ్ న్యూస్):**

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



# మహిళా "పవర్" మతిపోయే రాజకీయాలు

మొదటి పేజీ తరువాయి

అన్నారు.నిజాయితీగా రావలసిన పోలీస్ పోస్టింగ్లపై పైరవిలతో కూడిన రహస్య పోస్టింగులను ఇప్పించడంలో ఎమ్మెల్యే సహకారం సంపూర్ణంగా ఆ మహిళ సూచించిన అధికారులకే దక్కుతుండడం గమనించదగ్గ విషయం అన్నారు.కేవలం ఒక ప్రాంతంలోనే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రాజకీయ పైరవీలే కాకుండా అధికార కార్యాలయాల్లో పదోన్నతులతో పాటు బదిలీల ప్రక్రియను కూడా దగ్గరుండి చూసుకుంటున్నట్లు విశ్వాసనీయ సమాచారం అన్నారు.పైసా వ్యాపారం చేయాలంటే బంధుత్వాన్ని పాటించాలనే సూక్తులను కొనసాగిస్తున్న రాజకీయ నాయకులు ఆ మహిళా చెప్పు చేతల్లో నడుస్తున్నారని తన మాటే శిరోధార్యంగా భావిస్తున్నట్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రహస్య పైరవీలు పెరిగిపోతున్నాయి అన్నారు.పలు సందర్భాల్లో పోలీసు నిఘా వర్గాలు ఇట్టి పైరవీలపై కావలసినంత సమాచారాన్ని సేకరిస్తున్నప్పటికిని ఎమ్మెల్యే అండ ఉండడంతో ఏ విధమైనటువంటి సమాచారాన్ని ప్రభుత్వానికి గాని బయట గాని,పోలీస్ ఉన్నత వర్గాలకు గాని చేరవేయలేకపోతున్నారని మొత్తం మీదుగా రహస్య ఒప్పందాలతో జరుగుతున్న రాటుదేలే పైరవీలు ప్రభుత్వ వ్యవస్థలను పోలీసు వర్గాలను కదిలింప చేస్తున్నాయని పేర్కొన్నారు.ఒకే ఒక మహిళ రాజకీయ నాయకులను ప్రభుత్వాధికారులను పోలీస్ అధికారులను తన పలుకు బడికి లోనయ్యేలా చేసుకోగలుగుతున్నారంటే ఆమె వెనుకాల ఉన్న ఎమ్మెల్యే అద్భుతమైన రాజకీయ సహకారాన్ని ఉన్నత స్థాయిలో అందిస్తున్నారని పేర్కొన్నారు.స్వయంగా ఎమ్మెల్యే స్థాయి లాంటి రాజకీయ నాయకుడే తమ వద్దకు వస్తున్న పైరవిలను ఆ మహిళ వద్దకు పంపిస్తుండడం పట్ల ఓకింత ఆశ్చర్యకరమైన చర్చ నడుస్తుందని ఒకవైపు పైరవీలు,మరోవైపు అధికారులను శాసించడానికి,ఇంకొక వైపు పోస్టింగ్ల విషయంలో చెక్కుచెదరని ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ఇవన్నీ చూస్తుండగా తన ఆధిపత్యం దిన దినానికి పెంచుకుంటూ సమాజంలో ఒక రకమైన ప్రత్యేక ట్రెండును తయారు చేసుకుంటున్నట్లు అన్ని ప్రభుత్వ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తుందన్నారు.అధికారుల పదోన్నతుల్లో అధికారుల బదిలీలలో తనకు తిరుగులేని ప్రత్యేకతను కొనసాగిస్తుండగా ప్రతి ఆదిపద్యానికి సన్నిహిత ఎమ్మెల్యే జోరైన సహకారాన్ని అందించడమే కాకుండా ఆ మహిళా పలుకుబడిని పెంచేందుకు రహస్య పైరవీలు చేస్తున్నట్లు సమాచారం అన్నారు.

### పైరవీల ప్రత్యేకతకే ప్రాధాన్యత..

ఏం చేసైనా మహిళ ఆధిపత్యాన్ని పెంచే విధంగా తాపత్రయపడటంలో చోటమోట రాజకీయ నాయకులతో పాటు ప్రధాన ఎమ్మెల్యే తీవ్రంగా కృషి చేస్తుండడం పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిందన్నారు.ప్రధాన నాయకుల సహకారం ఉంటే సామాన్యులు సైతం ఏ విధంగా ఆధిపత్యం చలాయించగలరో ఊహించడానికే వీలు లేకుండా పోతుందన్నారు.రాజకీయ పార్టీల పేరు చెప్పి అధికార పార్టీల పేరు చెప్పి భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఆ మహిళ అండతో కబ్జాల పరంపర కొనసాగిస్తూ అధికారుల చర్యల నుండి ఉపశమనాన్ని పొందుకోగలుగుతున్నారని బాహాటంగా హెచ్చరించారు.పోలీస్ పోస్టింగులు పొందుకుంటున్న అధికారులలో కొంతమంది కరుడుగట్టిన భూకబ్జాలు చేస్తున్నప్పటికిని నగరం నడిబొడ్డున పోస్టింగులు పొందుకొని యదేచ్ఛగా చలామణి అవుతున్నారని అలాంటి అధికారులను పోలీసు ఉన్నత వర్గాలు కూడా గుర్తించలేకపోవడం గమనార్హం అన్నారు.పోలీస్ ఉన్నతాధికారులు మారుతున్నప్పటికిని పైరవీలతో పోస్టింగులు తెచ్చుకున్న స్టేషన్స్ అధికారులు మాత్రం మారడం లేదని దీర్ఘకాలికంగా ఒకే స్థానంలో పనిచేస్తూ ఎక్కడ చూసినా భూకబ్జాలను ప్రోత్సహిస్తూ, భూకబ్జాలో ,తలదూరుస్తూ భూకబ్జాలను పెంచి పోషిస్తున్న పోలీస్ అధికారులకు ఎక్కడలేని గౌరవ మర్యాదలు దక్కుతున్నాయని వాటన్నిటిని నూతన పోలీస్ కమిషనర్ లోతైన స్థాయిలో అధ్యయనం చేస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పోలీస్ వర్గాలనే కాకుండా,కిందిస్థాయి రాజకీయ వర్గాలను,ప్రభుత్వ కార్యాలయాలను,ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగించాల్సిన పైరవీలను తన చెప్పు చేతుల్లో పెట్టుకోవడం కోసం తన వద్దకు రాగలుగుతున్న పైరవీలలో అన్నివ్యవస్థలను శాసించే విధంగా పైరవీలు చెలాయించేలా చేస్తున్నాయని గుర్తుచేశారు.ఆ నాయకులు ఆ అధికారులు ఆ మహిళా చుట్టూ పైరవీలు చేయడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడం పట్ల వరంగల్ జిల్లాలోని ఒక ఎమ్మెల్యే ఆ మహిళా వెనుకుండి తీవ్రమైన రాజకీయాలు చేస్తున్నారని ఈ మధ్యకాలంలో జరిగిన కొన్ని పైరవీలు స్పష్టం చేస్తుండగా మరి కొంతమంది పోలీసు అధికారులు నూతన పోస్టింగ్ ల కోసం ఆ మహిళా చుట్టూ తిరుగుతుండడం పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీస్ పోస్టింగ్ల వ్యవహారం రాజకీయ సిఫారసులకు మాత్రమే ప్రాధాన్యత దక్కుతున్నట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు.రాజకీయం అధికారం పైరవీలను సమపాల్లుగా శాసిస్తుండడంలో ఆ మహిళతో పైరవీలు కొనసాగిస్తున్న ఎమ్మెల్యే ప్రజాసేవను మర్చిపోతున్నట్లుగా ప్రజలు పలురకాల అనుమానాలను వ్యక్తపరుస్తున్నారన్నారు. ఇలాంటి పైరవీలపై అర్బన్ నిఘా విభాగంతో పాటు,ఇంటెలిజెన్స్ విభాగాలు క్షేత్రస్థాయి ఆధారాలను సమీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.పోలీస్ పదవులకు రాజకీయ అండదండలు ఉంటే ప్రజాసేవ పూర్తిగా కుంటుపడే ఆస్కారం ఉందని పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా సామర్థ్యం కలిగిన పోలీస్ అధికారులకు నిజాయితీ కలిగిన పోలీస్ అధికారులకు భూకబ్జాలకు పాల్పడని పోలీస్ అధికారులకు పోలీస్ పోస్టింగ్ల విషయంలో సదవకాశాలు కల్పిస్తూ రాజకీయ నాయకులకు వాళ్లు కొనసాగిస్తున్న వ్యాపారాలకు సహకరించని పోలీస్ అధికారులకు సామాజిక కోణంలో సాంకేతిక కోణంలో పోస్టింగులు లభించగలిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రశాంతంగా ఉంటుందని పూర్వపు వైభవాన్ని అందిపుచ్చుకోగలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

"ఆ"ఎమ్మెల్యే సాహసవంతుడు త్వరలో.

---

## వర్ధన్నపేట ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ కలకలం

**25 మంది విద్యార్థులు అస్వస్థత.. ఆసుపత్రిలో చికిత్స**




**వరంగల్, 3 ఆగస్టు 2026( జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం ఫుడ్ పాయిజనింగ్ ఘటన కలకలం రేపింది. పాఠశాలలో భోజనం చేసిన అనంతరం సుమారు 25 మంది విద్యార్థులు వాంతులు, వికారం, కడుపునొప్పి వంటి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది వెంటనే వారిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఘటన విషయం తెలుసుకున్న అధికారులు ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ ప్రారంభించారు. విద్యార్థులకు అందించిన ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార నిల్వ విధానాలపై దర్యాప్తు చేపట్టారు. అవసరమైన ఆహార నమూనాలను సేకరించి పరీక్షలకు పంపినట్లు తెలిసింది. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## అక్రమ టోల్ గేట్లపై ములుగులో మౌన సమరం

**ప్రజలపై భారంగా మారిన టోల్ వసూళ్లను వెంటనే రద్దు చేయాలి - ఎస్పీకే సాగర్**

**కలెక్టరేట్ ఎదుట నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో మౌన పోరాట దీక్ష**

**కలెక్టర్‌కు వినతిపత్రం.. స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**

**గిరిజనులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులపై పడుతున్న ఆర్థిక భారంపై తీవ్ర ఆగ్రహం**



**ములుగు, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ఏటూరునాగారం-పసర జాతీయ రహదారిపై అక్రమంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట సోమవారం ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ (అడ్మిన్) ఎస్పీకే సాగర్ ఆధ్వర్యంలో మౌన పోరాట దీక్ష నిర్వహించారు. టోల్ గేట్ల పేరుతో ప్రజల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీకే సాగర్ మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అటవీ శాఖ అధికారులు టోల్ గేట్లను ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మణుగూరు, భద్రాచలం, ఏటూరునాగారం ప్రాంతాలకు చెందిన గిరిజనులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజలపై అనవసర ఆర్థిక భారం మోపుతున్న ఈ టోల్ వ్యవస్థను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి టోల్ గేట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్రమ టోల్ గేట్ల అంశంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కౌగిరి అజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం టోల్ గేట్ల వ్యవహారాన్ని వెంటనే పునఃసమీక్షించాలని కోరారు. గిరిజనులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రజలపై అదనపు భారం మోపే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రజల నుంచి అక్రమంగా టోల్ వసూలు చేయడం వినియోగదారుల హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు వెంటనే జోక్యం చేసుకుని అక్రమ టోల్ గేట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మౌన పోరాట దీక్షలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చైర్మన్ మేకల మల్లేష్, ఎస్పీకే సాగర్ యువసేన జిల్లా అధ్యక్షుడు గంధం సిద్దు, ములుగు జిల్లా నాయకులు మామిడి సాయికుమార్, నూనె నరేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాసంఘాల నాయకులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై దీక్షకు సంఘీభావం తెలిపారు.

## ఆగస్టు 16లోపు గ్యాస్ ఈ-కేవైసీ తప్పనిసరి

**పూర్తి చేయని వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం..**




**హైద్రాబాద్, 4 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులకు చమురు మార్కెటింగ్ సంస్థలు కీలక సూచనలు జారీ చేశాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి కుటుంబం ఆగస్టు 16లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ (వ-ఖ్జ) పూర్తి చేయాలని ఆదేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలకు తరలివెళ్తున్నారు. ఇటీవల ఎల్పీజీ రంగంలో బుకింగ్ విధానం, సిలిండర్ డెలివరీ విధానంలో పలు మార్పులు అమల్లోకి వచ్చాయి. వాణిజ్య, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా వరుసగా పెరగడంతో వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి గ్యాస్ కనెక్షన్‌కు ఈ-కేవైసీ పూర్తి చేయడం తప్పనిసరి అని చమురు సంస్థలు స్పష్టం చేశాయి. వినియోగదారులు ఏజెన్సీల వద్ద క్యూల్లో నిలబడాల్సిన అవసరం లేకుండా డెలివరీ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి ఈ-కేవైసీ నిర్వహించే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ అనేక సాంకేతిక, వ్యక్తిగత సమస్యల కారణంగా పలువురు ఈ ప్రక్రియను పూర్తి చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ కనెక్షన్‌దారు విదేశాల్లో ఉండటం, మరణించి ఉండటం, వృద్ధుల వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడం, ఆధార్ వివరాలు, గ్యాస్ కనెక్షన్ వివరాల్లో వ్యత్యాసాలు ఉండటం, ఒకే కుటుంబంలో రెండు కనెక్షన్లు ఉండటం వంటి కారణాలతో అనేక కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమస్యలకు గ్యాస్ ఏజెన్సీలు, ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు త్వరితగతిన పరిష్కారం చూపాలని వినియోగదారులు కోరుతున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావం ఇంధన మార్కెట్‌పై కొనసాగుతున్న నేపథ్యంలో ఎల్పీజీ ధరల్లో కూడా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీంతో వినియోగదారులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ఆగస్టు 16లోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## నిజామాబాద్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ మెషిన్ అవసరం


**హైదరాబాద్,ఆగస్ట్3(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించిన నిజామాబాద్ జిల్లా ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా ఆరోగ్య సంబంధిత సమస్యలు, ప్రభుత్వ వైద్య సంస్థల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, మందుల లభ్యత, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, ప్రజారోగ్య సేవల మెరుగుదల తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గం ఆరోగ్య శాఖ కు సంబంధించి పలు ప్రతిపాదనలు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహకి అందించి మంజూరు చేయవలసిందిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. నిజామాబాద్ జిల్లా ?ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఎంఆర్ఐ మెషిన్ ను మంజూరు చేయాలనీ, ఖాళీ పోస్టు లను భర్తీ చేయాలనీ,అత్యవసర అవసరాల కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

## మెడికవర్ హాస్పిటల్‌లో 100వ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

అత్యాధునిక వైద్య సాంకేతికతను అవలంబించడంలో అగ్రగామి అయిన బెంగళూరులోని మెడికవర్ హాస్పిటల్, తన 100వ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి మరో ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఆర్థోపెడిక్స్ మరియు రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఆర్.డి. చక్రవర్తి నేతృత్వంలో డాక్టర్ సంజయ్ ప్రసాద్ హెగ్డే, డాక్టర్ కృష్ణ కుమార్ ఎం.ఎస్., డాక్టర్ రవీంద్ర పుట్టస్వామయ్య, డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి రాచమల్లు వైద్యుల బృందం, అనస్థీటిస్టులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఫిజియోథెరపిస్టుల అంకితభావంతో కూడిన సేవ ఫలితంగా ఈ ఘనత సాధ్యమైంది. రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలో అత్యాధునిక ఇమేజింగ్ టెక్నాలజీ, కచ్చితమైన శస్త్రచికిత్స ప్రణాళిక మరియు రోబోటిక్ వ్యవస్థను ఉపయోగిస్తారు. దీని ఫలితంగా కృత్రిమ మోకాలిని మరింత కచ్చితంగా అమర్చడం, కీలు సమతుల్యత మెరుగుపడటం, నొప్పి తగ్గడం, వేగంగా కోలుకోవడం మరియు రోగులకు మెరుగైన దీర్ఘకాలిక ఫలితాలు లభిస్తాయి. తీవ్రమైన మోకాలి ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న చాలా మంది రోగులు ఈ సాంకేతికతతో నొప్పి లేని, చురుకైన జీవితానికి తిరిగి వచ్చారు. ఈ ఘనత గురించి మాట్లాడుతూ, డాక్టర్ ఆర్.డి. చక్రవర్తి మాట్లాడుతూ "100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం మా బృందానికి గర్వకారణం. రోబోటిక్ సాంకేతికత ప్రతి రోగి యొక్క వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా అత్యంత కచ్చితమైన శస్త్రచికిత్సలను నిర్వహించడానికి మాకు వీలు కల్పిస్తుంది. దీనివల్ల రోగులు వేగంగా కోలుకుని, దీర్ఘకాలంలో మెరుగైన కార్యాచరణ ఫలితాలను సాధించగలుగుతారు. ఈ అత్యాధునిక చికిత్సను మరింత ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావడానికి మేము కట్టుబడి ఉన్నాము," అని ఆయన అన్నారు. డాక్టర్ కృష్ణ కుమార్ ఎం.ఎస్. మాట్లాడుతూ, "ఈ మైలురాయి మా బృందం యొక్క సమన్వయ కృషికి నిదర్శనం. రోబోటిక్ సాంకేతికత సురక్షితమైన, కచ్చితమైన మరియు అధిక నాణ్యత గల శస్త్రచికిత్సలను నిరంతరం అందించడానికి మాకు వీలు కల్పిస్తుంది," అని అన్నారు. ఈ ఘనతను అభినందిస్తూ, మెడికవర్ హాస్పిటల్స్ ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ "100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం మెడికవర్ హాస్పిటల్ యొక్క వైద్య నైపుణ్యానికి మరియు ఆవిష్కరణలకు నిదర్శనం. రోగులకు ప్రపంచ స్థాయి చికిత్సను అందించే లక్ష్యంతో మా అత్యాధునిక సాంకేతికతను మరియు నిపుణులైన వైద్యులను బలోపేతం చేయడానికి మా ప్రయత్నాలు కొనసాగుతాయి." అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ మరియు అనుభవజ్ఞులైన బహుళ-విభాగాల వైద్య బృందంతో, మెడికవర్ హాస్పిటల్ సురక్షితమైన, కచ్చితమైన మరియు రోగి-కేంద్రీకృత మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను అందించడం ద్వారా ఆర్థోపెడిక్స్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది అని తెలిపారు.



# జాన్సన్ గ్రామర్ స్కూల్ ముంపు సమస్యకు శాశ్వత





**జాన్సన్ గ్రామర్ స్కూల్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం.. భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం భూమి పూజ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**హైద్రాబాద్, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్ పరిసర ప్రాంతంలో నెలకొన్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్ ముందు వీధితో పాటు ఇందిరానగర్ వీధి నంబర్--3లో ఈ భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రతి చిన్న వర్షానికే ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. శాంతి గార్డెన్స్ వెనుక భాగంలో ఉన్న బాక్స్ డ్రెయిన్ పూర్తిగా పూడికతో నిండిపోవడం వల్ల వర్షపు నీరు సక్రమంగా వెళ్లక జాన్సన్ గ్రామర్ స్కూల్ పరిసర ప్రాంతం తరచూ జలమయమవుతోంది. ఈ సమస్యను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ దృష్టికి తీసుకెళ్లగా, సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. మొదట రూ.35 లక్షలతో నాలా డీసిల్టింగ్, ఒకటిన్నర అడుగుల పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే సూచన మేరకు రెండు అడుగుల వ్యాసం కలిగిన పైప్‌లైన్ నిర్మించాలని నిర్ణయించి ప్రతిపాదనలను సవరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడం, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే తమ లక్ష్యమని తెలిపారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, డీజీఎం వేణుగోపాల్, మేనేజర్ రోహిత్, స్థానిక ప్రజాప్రతినిధులు, బస్తీవాసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ అండగా ఉంటుంది: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్





**వరంగల్, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా పోచమ్మ మైదాన్ సెంటర్‌లో దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత క్రైస్తవ శాంతియుత మహా దీక్ష కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈర్ల కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో దళిత క్రైస్తవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని విశ్వసించే, ఆచరించే, ప్రచారం చేసే హక్కును కల్పించిందని తెలిపారు. ప్రజల మత స్వేచ్ఛకు భంగం కలగకుండా రాజ్యాంగబద్ధమైన విధానాలను కొనసాగించాలని, దేశంలో అన్ని మతాల ప్రజలకు సమాన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. దేశంలో క్రైస్తవులు, పాస్టర్లపై జరుగుతున్న దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఏ మతానికి చెందిన ప్రజలపైనా భయాందోళనలు సృష్టించడం, రాజ్యాంగ హక్కులను హరించే చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని చెప్పారు. సమాజంపై ఒకే విధమైన భావజాలాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నాలు దేశ ఐక్యతకు, సామాజిక సామరస్యానికి హానికరమని వ్యాఖ్యానించారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, వారి న్యాయమైన హక్కుల సాధన కోసం అన్ని స్థాయిల్లో పోరాటం కొనసాగిస్తామని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ మహా దీక్షలో దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు.

# నల్గొండ నరసయ్యకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి



**కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ మడికొండ శ్రీను తదితర నాయకులు**

**పరకాల, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్ తండ్రి నల్గొండ నరసయ్య ఇటీవల కన్నుమూయగా, దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలోని వారి స్వగృహానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నల్గొండ నరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొండేటి కొమురారెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులు అల్లం రఘునారాయణ, కాంగ్రెస్ నాయకులు బొచ్చు భాస్కర్, బొజ్జం సాయి కుమార్, పసుల బంటి బాబు తదితరులు పాల్గొని నల్గొండ నరసయ్యకు ఘన నివాళు లర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన మహేందర్ యాదవ్

**వరంగల్, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



అత్యవసర పరిస్థితుల్లో స్పందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన కానిస్టేబుల్ చిలువేరు మహేందర్ యాదవ్. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి. ఉమా అనే రోగికి అత్యవసరంగా ఓ నెగటివ్ రక్తం అవసరమని సమాచారం అందడంతో వెంటనే ఆస్పత్రికి చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇది ఆయన చేసిన 19వ రక్తదానం కావడం విశేషం. జనగాం జిల్లా పాలకుర్తి మండలం తొర్రూరు గ్రామానికి చెందిన చిలువేరు కృష్ణమూర్తి, మల్లమ్మ దంపతుల ద్వితీయ కుమారుడైన మహేందర్ యాదవ్, ఏఆర్-2009 బ్యాచ్ కానిస్టేబుల్‌గా ప్రస్తుతం వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూఆర్టీ)లో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణతో పాటు సామాజిక సేవలోనూ ముందుంటూ అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఆయన 19వసారి ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేయడంతో వైద్యులు, తోటి పోలీసు సిబ్బంది, రోగి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు. అరుదైన రక్తగ్రూప్ కలిగిన వ్యక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని వారు పేర్కొన్నారు. సేవాభావంతో వరుసగా రక్తదానాలు చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న కానిస్టేబుల్ చిలువేరు మహేందర్ యాదవ్‌ను పలువురు అభినందించారు.

## బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ఆధునిక సదుపాయాలు

**ములుగు జిల్లాకు 27 శానిటరీ నాప్‌కిన్ ఇన్సినిరేటర్లు**




**ములుగు, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

బాలికల ఆరోగ్యం, రుతుక్రమ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు ములుగు జిల్లాలో ఆధునిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోవిందరావుపేట మండలం చల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి శానిటరీ నాప్‌కిన్ ఇన్సినిరేటర్ యంత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ జిల్లా సమన్వయ అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ, గత ఏడాది స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పంపిన ప్రతిపాదనల మేరకు ఈ ఏడాది జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాకు మొత్తం 27 శానిటరీ నాప్‌కిన్ ఇన్సినిరేటర్ యంత్రాలు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో బీసీ సంక్షేమ శాఖకు ఒకటి, మైనారిటీ సంక్షేమ శాఖకు రెండు, ఎస్సీ సంక్షేమ శాఖకు ఒకటి, విద్యాశాఖకు పది, గిరిజన సంక్షేమ శాఖకు పదమూడు యంత్రాలను కేటాయించినట్లు వెల్లడించారు. రుతుక్రమ పరిశుభ్రత బాలికల ఆరోగ్య పరిరక్షణలో అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, విద్యాసంస్థల్లో వినియోగించిన శానిటరీ నాప్‌కిన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించేందుకు ఈ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. యంత్రాలను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు ప్రతి నెల వాటి వినియోగ వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలోని స్వచ్ఛ భారత్ మిషన్ విభాగానికి సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. త్వరలో సాంకేతిక నిపుణులు సంబంధిత విద్యాసంస్థలను సందర్శించి యంత్రాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి. రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛ భారత్ మిషన్ సిబ్బంది, చల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమణపై ప్రజావాణిలో ఇన్‌చార్జి కలెక్టర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు

**హన్మకొండ, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో లక్ష్మీపురం న్యూ బస్టాండ్ సమీపంలోని కాలనీవాసులు రోడ్డు ఆక్రమణపై ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవికి ఫిర్యాదు చేశారు. కాలనీలోని రాజబాబు, గందె కృష్ణ అనే వ్యక్తులు తమ ఇంటి స్థలానికి ఆనుకుని ఉన్న ప్రజా రహదారిపై ప్రహరీ గోడ నిర్మించి రోడ్డును అక్రమంగా ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించి ప్రజలకు రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ఫిర్యాదును స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కాజీపేట డిప్యూటీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నవీన్, శీను, సతీష్, చిదరాల శ్రీను, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# వరుస బైక్ చోరీల ముఠా అరెస్ట్..

# 28 ద్విచక్ర వాహనాల స్వాధీనం





**పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్**

**వరంగల్, 3 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా చోటుచేసుకున్న ద్విచక్ర వాహనాల చోరీల కేసులను ఛేదించిన సీసీఎస్, కేయూసీ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల పెరుగుతున్న బైక్ చోరీలపై నమోదైన కేసులను సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో విశ్లేషించాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. అరెస్టైన నిందితులు దొంతుల ప్రశాంత్ కుమార్ (20), ఎన్‌టీపీసీ, మంచిర్యాల నివాసి, అలాగే దుర్గం సాయి కార్తీక్ (21), జైపూర్ మండలం, మంచిర్యాల జిల్లా నివాసిగా పోలీసులు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీ లకు పాల్పడినట్లు విచారణలో తేలింది. వాహన తనిఖీల సందర్భంగా నిందితులు ప్రయాణిస్తున్న ఏపీ 36 ఏవై 4700 నంబర్ గల పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని విచారించగా, కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునిపల్లి గ్రామ శివారు, ఎలుకతుర్తి సమీప ప్రాంతాల్లో దాచిపెట్టిన వాహనాల గురించి సమాచారం ఇచ్చారు. నిందితుల చూపిన మేరకు అక్కడి నుంచి మొత్తం 28 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర మోడళ్లకు చెందిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వీటిలో వరంగల్ కమిషనరేట్‌కు చెందినవి 8, కరీంనగర్ కమిషనరేట్‌కు 9, రామగుండం కమిషనరేట్ (పెద్దపల్లి)కు 3, సిద్ధిపేట కమిషనరేట్‌కు 2, హైదరాబాద్ కమిషనరేట్‌కు 3, రాచకొండ కమిషనరేట్‌కు 1, భూపాలపల్లి జిల్లాకు చెందిన 2 వాహనాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల కేసులతో వీటిని అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులపై గతంలో కూడా పలు ఆస్తి నేరాల కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం అప్పగిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్క్ చేయడంతో పాటు స్టీరింగ్, వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎ. రాఘవేందర్, ఈ. హరికృష్ణ, కె. రామకృష్ణ, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, సీసీఎస్ ఎస్‌ఐ శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఐటీ కోర్ టీమ్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో హనుమకొండ, సీసీఎస్ ఏసీపీలు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.



# వెల్‌నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి: హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి





**హన్మకొండ, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు అందించే వెల్‌నెస్ సెంటర్‌లో సేవలను మరింత మెరుగుపరచాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న వెల్‌నెస్ సెంటర్‌ను ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, నేత్ర విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ సుష్మితను వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలపై అడిగి తెలుసుకున్న ఆయన, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలు, సౌకర్యాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్. రవి మాట్లాడుతూ, వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ల్యాబ్‌లో రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ సుష్మిత, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్లలో సీసీటీవీలు తప్పనిసరి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు




**న్యూఢిల్లీ, 3 ఆగస్టు 2026(జకయ్ భీమ్ న్యూస్)**

దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లు, దర్యాప్తు సంస్థల్లో ఆడియో, వీడియో రికార్డింగ్ సదుపాయం కలిగిన సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చారిత్రాత్మక ఆదేశాలు జారీ చేసింది. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. పోలీస్ స్టేషన్లలో విచారణ గదులు, లాకప్‌లు, ప్రవేశ ద్వారాలు, కారిడార్లు, ఇతర కీలక ప్రాంతాలన్నీ నిరంతరం సీసీటీవీ నిఘా పరిధిలో ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పోలీస్ కస్టడీలో జరిగే హింస, మానవ హక్కుల ఉల్లంఘనలను నివారించడం, విచారణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం ఈ ఆదేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్--21 ప్రతి పౌరుడికి జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తోందని కోర్టు గుర్తుచేసింది. సీసీటీవీ నిఘా వల్ల దర్యాప్తు ప్రక్రియ మరింత నిష్పక్షపాతంగా సాగుతుందని, పోలీసుల బాధ్యతాయుతమైన వ్యవహారశైలికి ఇది దోహదపడుతుందని అభిప్రాయపడింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించడంతో పాటు చట్టబద్ధమైన పాలనను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. ఈ చారిత్రాత్మక మార్గదర్శకాలను 2020లో "పరంవీర్ సింగ్ సైనీ వర్సెస్ బల్జీత్ సింగ్ అండ్ అదర్స్" కేసులో సుప్రీంకోర్టు వెలువరించింది. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ వ్యవస్థల ఏర్పాటుకు ఈ తీర్పు కీలక ఆధారంగా నిలిచింది.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని ఆలస్యం చేయకుండా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 153 దరఖాస్తులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు 41, జీడబ్ల్యూఎంసీకి 30, హౌసింగ్ శాఖకు 20, ఇతర శాఖలకు సంబంధించిన 62 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో ముఖ్యంగా రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని సమస్యలకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిరుద్యోగ సమస్యపై వచ్చిన వినతులను పరిశీలించిన కలెక్టర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో టైలరింగ్‌లో నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అర్హులైన యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వోకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# సైబర్ నేరాలపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ

**దర్యాప్తు నైపుణ్యాల పెంపుపై దృష్టి**



**వరంగల్, 3 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తు సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులకు సోమవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిఎస్ సీ.ఎస్.బి) సూచనలతో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్న ఈ శిక్షణలో ఆర్థిక సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నమోదు, సైబర్ పోర్టల్ల వినియోగం, "గోల్డెన్ అవర్"లో వేగంగా స్పందించే విధానాలు, అంతర్రాష్ట్ర సమన్వయం, ఆధునిక సాంకేతికతతో నేరస్థులను గుర్తించే పద్ధతులపై నిపుణులు శిక్షణ ఇచ్చారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం. వెంకట రమణ, ఇన్‌స్పెక్టర్లు ఎస్.కె. యాసీన్, కె. అశోక్ కుమార్, ఎస్‌ఐలు చరణ్, శివకుమార్, ఏఏఓ సల్మాన్‌తో పాటు సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొని అధికారులకు ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా సైబర్ నేరాల దర్యాప్తులో పోలీసు అధికారుల నైపుణ్యాలు మరింత మెరుగుపడి, బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు.





# కాకతీయ విశ్వవిద్యాలయ డిగ్రీ మొదటి, రెండవ, మూడవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల విడుదల

**హన్మకొండ, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం మే నెలలో నిర్వహించిన డిగ్రీ మొదటి, రెండవ, మూడవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ, మొదటి సెమిస్టర్‌లో 28 శాతం, రెండవ సెమిస్టర్‌లో 33 శాతం, మూడవ సెమిస్టర్‌లో 38 శాతం, నాల్గవ సెమిస్టర్‌లో 38 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను కాకతీయ విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ zzz1ndndwl|d1df11q ద్వారా పరిశీలించుకోవచ్చని సూచించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు



డాక్టర్ తిరుమల దేవి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పద్మజ, డాక్టర్ అసీం ఇక్బాల్, సహాయ రిజిస్ట్రార్ రామా వెంకటేశ్వర్లు, నాయకపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్లు ప్రారంభం

**హన్మకొండ, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**




వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, స్పెషల్ డ్రైవ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 6 నుంచి 11 వరకు కొనసాగుతుందని, వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆగస్టు 6 నుంచి 12 వరకు అవకాశం ఉంటుందని చెప్పారు. స్పెషల్ డ్రైవ్ ఫేజ్ సీట్ల కేటాయింపు ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాల్సి ఉంటుందని, అనంతరం ఆగస్టు 17, 18 తేదీల్లో కళాశాలకు తప్పనిసరిగా హాజరై కాలేజ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఏ డిగ్రీ కళాశాలలోనూ ప్రవేశం పొందని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణ విద్యార్థులు ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా బి.ఏ. (తెలుగు, ఇంగ్లీష్ మీడియం), బి.కాం (కంప్యూటర్స్), బి.కాం (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్), బి.బి.ఏ., బి.ఎస్సీ (ఫిజికల్ సైన్స్), బి.ఎస్సీ (లైఫ్ సైన్స్), బి.ఎస్సీ (హెల్త్ కేర్), బి.ఎస్సీ (డెయిరీ అండ్ పౌల్ట్రీ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## "సీకేఎం కళాశాలలో 'రామరాజ్యం'..?

**రిటైర్డ్ ప్రిన్సిపల్ సర్వీస్ బుక్ వ్యవహారంపై ఆరోపణలు కలకలం**

**వరంగల్, 03 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని సీకేఎం (చందా కాంతయ్య మెమోరియల్) కళాశాలలో రిటైర్డ్ ప్రిన్సిపల్‌కు సంబంధించిన సర్వీస్ బుక్ వ్యవహారం మూడు రోజుల పాటు తీవ్ర చర్చకు దారితీసినట్లు సమాచారం. పదవీ విరమణ అనంతరం పెన్షన్, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలకు అత్యంత కీలకమైన సర్వీస్ బుక్ కోసం మాజీ ప్రిన్సిపల్ పలుమార్లు కళాశాల కార్యాలయాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని చెబుతున్నారు. సర్వీస్ బుక్‌ను వెంటనే ఇవ్వకుండా మూడు రోజుల పాటు ఆలస్యం చేశారని ఆరోపిస్తున్నారు. దీంతో ఆయన తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మరో సంచలన అంశం వెలుగులోకి వచ్చినట్లు కళాశాల వర్గాల్లో చర్చ జరుగుతోంది. సర్వీస్ బుక్‌ను అందించేందుకు సంబంధిత ఉద్యోగి రూ.1,000 అడిగారని కళాశాలలోని కొంతమంది ఉద్యోగులు, అధ్యాపకులు పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి స్పందన వెలువడలేదు. ఈ ఘటనపై సంబంధిత ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని కూడా కళాశాల వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ విద్యాసంస్థలో ఇటువంటి ఆరోపణలు రావడం పలు ప్రశ్నలకు తావిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై కళాశాల యాజమాన్యం, ఉన్నత విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

**కొసమెరుపు**

"సర్వీస్ బుక్ ఇవ్వాలంటే రూ.1,000 కావాలని సంబంధిత ఉద్యోగి అడిగారని కళాశాలలోని కొంతమంది ఉద్యోగులు, అధ్యాపకులు చెప్పుకుంటుండటం ఇప్పుడు సీకేఎం కళాశాలలో హాట్‌టాపిక్‌గా మారింది."




## కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆగస్టు 12, 13 తేదీల్లో జాతీయ సదస్సు

**కాలుష్య నియంత్రణకు బహుళ భాగస్వామ్య సంస్థల సమన్వయమే లక్ష్యం**

**హన్మకొండ, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆగస్టు 12, 13 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ), స్టేట్ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ (ఎస్‌ఈఏసీ), తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు "సినెర్జిసింగ్ ఇన్స్టిట్యూషన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ : స్ట్రాటెజిక్ అండ్ మల్టీ స్టేక్ హోల్డర్ అప్రోచ్ టు పొల్యూషన్ కంట్రోల్ " అనే ప్రధాన అంశంపై జరగనుంది. ఈ విషయాన్ని సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యులు ఆచార్య గాదె దయాకర్ వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, కాలుష్య నియంత్రణలో సమిష్టి బాధ్యతను పెంపొందించడమే ఈ జాతీయ సదస్సు ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. ఆగస్టు 12న నిర్వహించే ప్రీ-కాన్ఫరెన్స్‌కు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ వైస్-ఛాన్సలర్ ఆచార్య రవీంద్రనాథ్ ప్రారంభోపన్యాసం చేయనున్నారు. జేఈటీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బక్కారెడ్డి, హైదరాబాద్ టీఎస్‌డీఎఫ్ ప్రాంతీయ అధిపతి డాక్టర్ రాధాకృష్ణ సాయి, హెటెరో డ్రగ్స్ సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ ఈ.హెచ్.ఎస్. హరి, ఆచార్య పి.వి. రావు, ఆచార్య శ్రీధర్ తదితరులు ప్రసంగించనున్నారు. ఆగస్టు 13న జరిగే ప్రధాన సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి జి. రవి, ఐఏఎస్, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్య కార్యదర్శి డాక్టర్ బి. సెన్‌గుప్తా, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, భారత ప్రభుత్వ శాస్త్రవేత్త డాక్టర్ సుందర్ రామనాథన్, తెలంగాణ ప్రధాన అటవీ సంరక్షణాధికారి డాక్టర్ ప్రియాంక వర్గీస్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ చైర్మన్ జస్టిస్ సాంబశివరావు నాయుడు, స్టేట్ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ చైర్మన్ డాక్టర్ రామ్‌గోపాల్ రెడ్డి, ఐఎఫ్‌ఎస్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగించనున్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల నుంచి ఇప్పటికే 150 మంది ప్రతినిధులు నమోదు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. గణనీయ సంఖ్యలో పరిశోధన పత్రాలు అందాయని, ఎంపికైన పరిశోధన పత్రాలను ప్రత్యేక కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్ రూపంలో ప్రచురించనున్నట్లు వెల్లడించారు. సాంకేతిక సమావేశాలతో పాటు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సమకాలీన అంశాలపై ప్యానెల్ చర్చలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మమత తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా స్పందించిన కాజీపేట పోలీసులు.. రూ.4.50 లక్షల బంగారు గొలుసు రికవరీ

**కాజీపేట, 3 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



పోగొట్టుకున్న సుమారు రూ.4.50 లక్షల విలువైన బంగారు గొలుసును గుర్తించి బాధితురాలికి అప్పగించి కాజీపేట పోలీసులు మరోసారి తమ సమర్థతను చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసన్ కృష్ణస్వామి కుమార్తె శ్రీమతి మృదుల శ్రీనివాసన్ ఎన్ఐటీ వరంగల్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఐదో సంవత్సరం చదువుతున్నారు. ఆమెకు చెందిన సుమారు మూడు తులాల బంగారు గొలుసు ఆర్ఈసీ ప్రాంగణంలో పోగొట్టుకోవడంతో కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కాజీపేట ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై శివ పర్యవేక్షణలో క్రైమ్ టీమ్ సభ్యులు వి. క్రాంతి కుమార్, జి. కుమారస్వామి సీసీటీవీ ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి బంగారు గొలుసును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సుమారు రూ.4.50 లక్షల విలువైన బంగారు గొలుసును బాధితురాలు మృదుల శ్రీనివాసన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా కాజీపేట పోలీసుల వేగవంతమైన స్పందన, అంకితభావం, సమర్థవంతమైన సేవలకు బాధితురాలు మృదుల శ్రీనివాసన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తుల రక్షణలో కాజీపేట పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సేవలందిస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు.

## రోడ్డు ఆక్రమణపై ప్రజావాణిలో ఇన్‌చార్జి కలెక్టర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు



**హన్మకొండ, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో లక్ష్మీపురం న్యూ బస్టాండ్ సమీపంలోని కాలనీవాసులు రోడ్డు ఆక్రమణపై ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవికి ఫిర్యాదు చేశారు. కాలనీలోని రాజబాబు, గందె కృష్ణ అనే వ్యక్తులు తమ ఇంటి స్థలానికి ఆనుకుని ఉన్న ప్రజా రహదారిపై ప్రహరీ గోడ నిర్మించి రోడ్డును అక్రమంగా ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించి ప్రజలకు రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ఫిర్యాదును స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కాజీపేట డిప్యూటీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నవీన్, శీను, సతీష్, చిదరాల శ్రీను, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## శిశువులకు తొలి రక్షణ తల్లిపాలే

**ప్రతి తల్లి ఆరోగ్యం-ప్రతి శిశువు భవిష్యత్తుకు బలమైన పునాది**

**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి**




**హన్మకొండ, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ప్రతి తల్లి తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, శిశువులకు సమయానుకూలంగా తల్లిపాలు అందించాలని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండ గోపాల్‌పూర్‌లోని ఎంపీపీఎస్ ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాశన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు తన చేతుల మీదుగా అన్నప్రాశనం చేయించి ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించే అమూల్యమైన ఆహారమని పేర్కొన్నారు. శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని, ఆ తరువాత ఏడో నెల నుంచి వైద్యుల సూచనల మేరకు అనుబంధ పోషకాహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. పిల్లల తల్లులు తమ ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన తల్లే ఆరోగ్యవంతమైన బిడ్డకు పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌పూర్ ఆరోగ్య కేంద్రం--1 పరిధిలోని చిన్నారులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అంగన్‌వాడీ సూపర్వైజర్లు జ్యోతి, ఝాన్సీ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రీతి, జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సమత, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5న టీజీసీపీజీసెట్-2026 ఫలితాల విడుదల

**హన్మకొండ, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీసీపీజీసెట్--2026 (టీజీసీపీజీట్ --2026) ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆగస్టు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీజీ సీహెచ్‌ఈ) కార్యాలయంలో విడుదల చేయనున్నట్లు టీజీసీపీజీసెట్--2026 కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జూలై 8 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించిన టీజీసీపీజీసెట్--2026 ప్రవేశ పరీక్షల ఫలితాలను తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి అధికారికంగా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్, టీజీసీపీజీసెట్--2026 చైర్మన్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, ఉన్నత విద్యామండలి అధికారులు, రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. టీజీసీపీజీసెట్--2026 ఫలితాల అనంతరం కౌన్సెలింగ్ షెడ్యూల్, వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు తదితర ప్రవేశ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ త్వరలో ప్రకటించనున్నట్లు ఆచార్య రాజేందర్ కట్ల వెల్లడించారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem

# హాస్టల్ విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు ఆదేశం**

**వర్ధన్నపేట, 3 ఆగస్టు 2026 (జైభీమ్ న్యూస్)**

వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎస్టీ ట్రైబల్ గర్ల్స్ హాస్టల్‌కు చెందిన పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సోమవారం ఆస్పత్రిని సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పడంతో పాటు, ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యార్థినులు పూర్తిగా కోలుకునే వరకు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం బాధాకరమని అన్నారు. ఘటనకు గల కారణాలను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో చర్చించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. త్వరలోనే హాస్టల్‌ను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించి అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వైద్యుల సమాచారం ప్రకారం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని ఎమ్మెల్యే తెలిపారు. రాత్రి లేదా మంగళవారం ఉదయం నాటికి వారు పూర్తిగా కోలుకునే అవకాశముందని వైద్యులు చెప్పినట్లు పేర్కొన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన డీఎంహెచ్‌వో డా. బి. రాజా రెడ్డికి ఘన సన్మానం

**ప్రజారోగ్య సేవలపై అంకితభావంతో పనిచేయాలి: డీఎంహెచ్‌వో డా. బి. రాజా రెడ్డి**





**వరంగల్, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా. బి. రాజా రెడ్డిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు, జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీలు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో డా. బి. రాజా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రజారోగ్య సేవల పట్ల అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. శాఖాపరమైన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, తన పరిధిలో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేసి, నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. రాజమౌళి, డా. ఐ. ప్రకాష్, డా. రవీందర్‌తో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు.

**ఉచిత ఆరోగ్య శిబిరాన్ని అభినందించిన జర్నలిస్టులు**



**కూకట్‌పల్లి, 4,ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కూకట్‌పల్లి సీనియర్ పాత్రికేయుడు నజీర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకుడు, జర్నలిస్టు తెల్ల హరికృష్ణతో పాటు కూకట్‌పల్లి సీనియర్ పాత్రికేయుడు, మైత్రి కన్స్ట్రక్షన్ ఎండీ దాసరి రాహుల్ ప్రదీప్, హరికుమార్, బుల్లెట్ రవి, రవీందర్, మారుతి, బలరాం, అర్జున్, అనిల్, భాను, మున్నా భాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నజీర్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, రక్తంలో చక్కెర (షుగర్), రక్తపోటు (బీపీ) పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్యులు ప్రజలకు సేవలు అందించారు. ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పాత్రికేయ మిత్రులు పేర్కొన్నారు.

## సిదిరి పోలీస్ క స్టడీకి కోర్టు అనుమతి

**శ్రీకాకుళం,ఆగస్ట్3(జై భీమ్ న్యూస్):**

వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఒక రోజు పోలీస్ కస్టడీకి పలాస జూనియర్ సివిల్ జడ్జి అనుమతిచ్చారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గతనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ, సిద్దార్థ త్యాడీలను పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో ఏ3గా ఉన్న అప్పలరాజును అరెస్టు చేయగా ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా అంపోలులోని జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో పలాస పోలీసులు అప్పలరాజు కస్టడీకి పిటిషన్ వేయగా ఒక రోజు అనుమతిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు విచారించే అవకాశముంది.

## మోత్కూరు లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఘనంగా పాలేపల్లి వెంకటయ్య తెలుగు పండితులు పదవి విరమణ కార్యక్రమం







**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలుగా తెలుగు ఉపాధ్యాయులుగా విద్యను అందించి, విద్యార్థులను ఉన్నత స్థాయిలో చేరేందుకు పాలేపల్లి వెంకటయ్య సార్ కృషి ఎంతో ఉంది అని తోటి ఉపాధ్యాయులు చెప్పుకొచ్చారు. వివరాలు.. పాలేపల్లి వెంకటయ్య తెలుగు ఉపాధ్యాయులు 1965 లో జన్మించి, 3వ తరగతి వరకు పాలేపల్లి, పై చదువు 10 వ తరగతి వరకు దోమలో పూర్తి చేసి, తను ఆపై చదువులు ఇంటర్మీడియట్ పరిగి ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేసి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. 1990 లో ఉద్యోగం సంపాదించి పరిగి మండలం లొంక హనుమాన్ కాడ్లపూర్ తండా లో 2000 వేల సంవత్సరం నుంచి 2008 వరకు 8 వంవస్థరాలు పిల్లలకు బోధన పూర్తి చేసి, 2008 నుంచి 2012 వరకు 4 సంవత్సరాలు పరిగి సీ పీ ఎస్ బాయ్స్ స్కూల్ లో, బోధించి, 2012 నుంచి 2026 వరకు అంటే 14 సంవత్సరాలు మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రమోషన్ ద్వారా వచ్చి, తెలుగు అభ్యాసాలు బోధించి 100 కి 100 గ్రాస్ ను పెంచారు. ఆయన చేతిలో చదివిన పిల్లలు, తనను గుండెల్లో పెట్టుకున్నారు. ఎంతో మంది పిల్లలకు మార్గదర్శకుడిగా నిలిచాడు. ఐతే 26 సంవత్సరాల తన ఉపాధ్యాయ పదవికి సోమవారం రోజు పదవి విరమణ పొందారు. మోత్కూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తన తోటి ఉపాధ్యాయులు, తన తరగతి స్నేహితులు, పూర్వ విద్యార్థులు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పండు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ కొత్తపేట ఆనంద్, వార్డు సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కల్ మల్లేశం, విద్యాధికారి వెంకట్, ఎంపిడిఓ గ్యామ సార్, ఎమ్మార్వో, తదితరులు పాల్గొని, తన గురించి వాక్యానించారు. స్కూల్ విద్యార్థులు వారి వారి ప్రసంగాలతో వారి గురువు మనసును దోచుకున్నారు. నృత్యాలతో ఆకట్టుకున్నారు, పూల మాలలతో, శాలువాలతో సన్మానించారు, బహుమతులు అందించి విద్యార్థులు గురువుగారి దీవెనలు తీసుకున్నారు. వెళ్ళేముందు విద్యార్థి విద్యార్థీలు కన్నీరు పెట్టుకున్నారు. మీకు సమయం ఉన్నప్పుడు మమల్ని గుర్తించి అప్పుడప్పుడు మా స్కూల్ కి వచ్చి మీ అనుభవాన్ని మాకు బోధించండి అని కంటతడి పెట్టుకున్నారు. ఆ దంపతులు పిల్లలకు పెన్నులు, బహుమతులు కూడా అందించారు. ఉపాధ్యాయులు వెంకటయ్య మాటల్లో తన జీవితంలో ఒడిదుకులు, అనుభవాలు వివరిస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఆడేపు.విక్రమ్



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఇటీవల జరిగిన భారతీయ జనతా పార్టీ జిల్లా మోర్చా కమిటీల్లో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఐనవోలు మండల ఒంటిమమామిడిపల్లీ గ్రామానికి చెందిన ఆడేపు విక్రమ్ ను ఓబీసీ జిల్లా మోర్చా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ...నా పై నమ్మకం తో నాకు ఈ పదవి అందించిన వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట.రవికుమార్ కు,ఓబీసీ జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ వర్గాలకు పెద్దపీట వేస్తూ నరేంద్ర మోడీ క్యాబినెట్లో 27 మంది ఓబి సి మంత్రులకు స్థానం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో కూడా రాబోయే కాలంలో బిసి ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా తద్వారా బిసి వర్గాల అభివృద్ధిని భారతీయ జనతా పార్టీ బీసీ అభివృద్ధి పట్ల కృత నిశ్చయంతో ఉంది అని తెలియజేశారు జిల్లా స్థాయిలో తనకు అందించిన ఈ పదవిని బాధ్యతగా స్వీకరిస్తానని భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలియ చేస్తూ భారతీయ జనతా పార్టీలో సిద్ధాంత ం కోసం పనిచేసే వారికి సరైన గుర్తింపు ఉంటుందని తనకు లభించిన ఈ అవకాశం నిదర్శనం అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ అవకాశం రావడానికి సహకరించి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్ కి,డాక్టర్ టి రాజేశ్వర కి,వన్నాల శ్రీరాములు కు,జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నా ప్రభాకర్ కు వర్ధన్నపేట నియోజకవర్గం కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్ పంతిని సర్పంచ్ కన్నయ్య మండల పార్టీ అధ్యక్షులు మాదాస్ ప్రణయ్ మండల కమిటీ సభ్యులకు సీనియర్ నాయకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు చేశారు.

## అవయవ దానం మహోన్నత మానవతా సేవ: కాజీపేట పురుషోత్తం

**హన్మకొండ, 3 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అటవీ శాఖ విశ్రాంత అధికారి కాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ, అవయవ దానం మహోన్నత మానవతా సేవ అని అన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా పలువురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, యువత ఈ విషయంలో సమాజంలో అవగాహన కల్పించేందుకు ముందుండాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ, అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం అవసరమన్నారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో ప్రజాహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, అవయవ దానం వల్ల కలిగే ప్రయోజనాలు, చట్టపరమైన నిబంధనలు, ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ టి. శ్రవణ్ కుమార్, హనుమకొండ అధ్యక్షుడు శంకర్రావు, పగల్లపాటి ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!

వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతతో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది. ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన



హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

## అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది. పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి. గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ




అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము. ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది. వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

